క్లుప్తంగా

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలో ఈ నెల 31వ తేదీ బుధవారం రోజున 36వార్డులకు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముల్కల్ల పంప్‌హౌస్ వద్ద మరమ్మతులు చేపడుతున్నందునా, ఒక్కరోజు పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరాను నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

ఫిజియోథెరపీతో వైకల్యమార్పులు

దండేపల్లి: సెరిబ్రల్, ఆర్థోపెడిక్ దివ్యాంగులకు ఫిజియోథెరపీ ద్వారా వైకల్యంలో కొంత మార్పు వస్తుందని ఫిజియోథెరపిస్టు బి.జ్యోతిప్రియాంక అన్నారు. దండేపల్లి భవిత కేంద్రంలో మంగళవారం ఫిజియోథెరపీ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. భవిత కేంద్రం పిల్లలతో పాటు, 18ఏళ్ల లోపు గల సెరిబ్రల్, ఆర్థో దివ్యాంగుల కోసం వారం వారం భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మల్లేశం, భవిత కేంద్రం ఐఈఆర్పీ వెంకటేశ్వర్‌రావు, ఆయా సౌజన్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'పెద్దపల్లి ఎంపీ టిక్కెట్ ఆశిస్తున్నా..'

చెన్నూర్: కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి ఎంపీ టిక్కెట్ ఆశిస్తున్నానని, పార్టీ టిక్కెట్ ఇస్తే ఎంపీగా విజ యం సాధిస్తానని కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ జాడి రాజన్న అన్నారు. చెన్నూర్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవా రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయ న మాట్లాడారు. ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరామారావులను కలిసి ఎంపీ టిక్కెట్ కోసం విన్నవించడం జరిగిందన్నా రు. జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా మహాముత్తారం మండలంలోని స్థంభంపల్లి సర్పంచ్‌గా పనిచేస్తున్నానని తెలిపారు. జెడ్పీటీసీగా, భూపాల్‌పల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పని చేస్తున్నానని తెలిపారు. అధిష్టానం పెద్దపల్లి టిక్కెట్ ఇవ్వాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మహాముత్తారం మండల అధ్యక్షురాలు జాడి కీర్తి, మాజీ ఎంపీటీసీ పరుషరామ్, నాయకులు శ్రీనివాస్, దేవిలు పాల్గొన్నారు.

నర్సింగ్ ఆఫీసర్ ఉద్యోగానికి ఎంపిక


స్వరూప

దండేపల్లి: ఇటీవల విడుదలైన నర్సింగ్ ఆఫీసర్ ఫలితాల్లో దండేపల్లికి చెందిన బోర్లకుంట స్వరూప ఉత్తీర్ణత సాధించి ఉద్యోగానికి ఎంపికయ్యారు. బీసీ సీ విభాగంలో జోనల్ 4వ ర్యాంకు సాధించారు. నర్సింగ్ చేసిన ఆమె నర్సింగ్ ఆఫీసర్ ఉద్యోగ సాధనకు ఎంతో కష్టపడ్డారు. ఆమెకు ఉద్యోగం రావడంతో సంతోషం వ్యక్తం చేసింది.

సీడీపీవోకు సమ్మె నోటీసు అందజేత

చెన్నూర్: అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీఐటీయూ నాయకులు సీడీపీవో మనోరమకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ... కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఫిబ్రవరి 16న దేశ వ్యాప్త సమ్మెలో జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. చెన్నూర్ ప్రాజెక్ట్ పరిధిలో పనిచేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు బీఆర్‌ఎస్ కేవీ సంఘం నుంచి సీఐటీయూలో చేరారని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రంజిత్ కుమార్, నాయకులు రవి, చందు, నగేశ్, సమ్మక్క, రమాదేవి, ఉమారాణి, విజయలక్ష్మి, సుమతి, సరిత పాల్గొన్నారు.

జంతు సంక్షేమ, సంరక్షణ పక్షోత్సవాలు


భీమారం: పెంపుడు కుక్కలకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి రాకేశ్ శర్మ

భీమారం/దండేపల్లి/మంచిర్యాలరూరల్(హాజీపూర్): అడవులు సరస్సులు, నదులు, వన్యప్రాణులతో సహా సహజ పర్యావరణాన్ని రక్షించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ప్రధానంగా జంతు రక్షణకు జంతు సంక్షేమ పర్యవేక్షక కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని పశువైద్యాధికారులు సరిత, శాంతిరేఖ తెలిపారు. జంతు సంరక్షణ పక్షోత్సవాల్లో భాగంగా హాజీపూర్, దొనబండ, దండేపల్లి, భీమారం పశువైద్యశాలల్లో మంగళవారం పెంపుడు జంతువులకు మందులు వేశారు. పలు సూచనలు, సలహాలు చేశారు.

సమావేశం ఊసేది?


బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయం

- బెల్లంపల్లి బల్దియాలో జరగని సమావేశాలు
- వరుసగా మూడు నెలల నుంచి దాటవేస్తున్న వైనం
- సమావేశం కోసం సభ్యులు పట్టు
- స్పందించని పాలకవర్గం

బెల్లంపల్లి: ప్రజాసమస్యలపై చర్చించి పరిష్కారం చూపించే మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహణ పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారు. వరుసగా మూడు నెలల నుంచి ఆ ఊసే లేకుండా పోయింది. ప్రతీ నెల ఏర్పాటు చేయాల్సి ఉన్నా నిరాసక్తత చూపుతుండటంతో సభ్యుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. మున్సిపల్ పాలకవర్గం అనుసరిస్తున్న తీరు పై ఆగ్రహంగా ఉన్నారు. గడిచిన నవంబర్ నుంచి సమావేశాలు జరగడం లేదు. అదేనెలలో అసెంబ్లీ ఎన్నికలు రాగా, డిసెంబర్‌లో సమావేశం నిర్వహిస్తారని ఆశించారు. కాని చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్‌పై సభ్యులు అవిశ్వాసాన్ని ప్రకటించడంతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరానికి వెళ్లారు. ఈనెల 12న అవిశ్వాసంపై ఓటింగ్‌కు సమావేశం ఏర్పాటు చేయగా సరిపడా కో రం లేక వీగిపోయింది. ఆ ప్రక్రియ తర్వాత ఈనెల 19న మున్సిపల్ సాధారణ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు సమాచారం ఇచ్చారు. సభ్యులకు అజెండా కాపీలు అందజేసిన కొన్ని గంటల వ్యవధిలో వాయిదా వేశారు. అంతకుముందు ప్రతీనెల 20 నుంచి 30వ తేదీ మధ్యన సమావేశం నిర్వహించగా, మూడు నెలల నుంచి దాటవేత ధోరణిని ప్రదర్శిస్తుండటం చర్చనీయాంశంగా మారింది.

సభ్యుల పట్టు

మున్సిపల్ సమావేశం నిర్వహణకు సభ్యులు పట్టుబడుతున్నారు. భేషరతుగా ఏర్పాటు చేసి సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేస్తున్నా ఏమి పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసాన్ని ప్రతిపాదించిన తర్వాత పాలకవర్గం, సభ్యుల మధ్య పొరపొచ్చాలు పొడచూపాయి. అవిశ్వాసం ప్రకటించిన నేపథ్యంలో చైర్‌పర్సన్ శ్వేత బీఆర్‌ఎస్‌ని వీడి కాంగ్రెస్‌లో చేరగా, వైస్ చైర్మన్ సుదర్శన్ మున్సిపల్ సమావేశానికి గైర్హాజరుతో అవిశ్వాసాన్ని ప్రతిపాదించిన బీఆర్‌ఎస్ సభ్యులు కూటమిగా ఏర్పడ్డారు. ఏకంగా బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేశారు. అవిశ్వాసం వీగిపోయిన క్రమంలో సమస్యలపై గట్టిగా నిలదీయాలని సభ్యులు పట్టుదలతో ఉన్నట్లుగా తెలుస్తోంది. ఈక్రమంలో మున్సిపల్ సమావేశం ఎప్పుడు జరుగుతుందా అని ఆతృతను కనబరుస్తున్నారు. కాని ఈనెలలో ఆ అవకాశం లేకపోవడంతో ఆగ్రహావేశాలకు గురవుతున్నారు. మున్సిపల్ సమావేశం ఏర్పాటుచేయాలని కోరుతూ సభ్యులు ఈనెల 27న కమిషనర్ భుజంగరావు, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాలు అందజేసినా మార్పు లేకుండా పోయింది.

ఎమ్మెల్యే హాజరైతేనే..

ప్రస్తుత పరిస్థితుల్లో సమావేశం నిర్వహించే అవకాశాలు లేనట్లుగా తెలుస్తోంది. అనువైన పరిస్థితుల కోసం పాలకవర్గం పడిగాపులు కాస్తున్నట్లు సభ్యులు పేర్కొంటున్నారు. తాజాగా పరిణామాల నేపథ్యంలో సమావేశం నిర్వహిస్తే మెజార్టీగా ఉన్న కూటమి సభ్యులు సమస్యలపై నిలదీయటంతోపాటు తీర్మానాలు చేయకుండా అడ్డుకుంటారనే భయం పాలకవర్గానికి పట్టుకున్నట్లుగా చర్చించుకుంటున్నారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను ప్రత్యేకంగా ఆహ్వానించి సమావేశం నిర్వహిస్తే ఉపయుక్తంగా ఉంటుందని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరిలో ఎమ్మెల్యే నుంచి సమ్మతి తీసుకుని సమావేశం నిర్వహించాలని యోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.


చెన్నూర్: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


లక్సెట్టిపేట: నివాళులర్పిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

ఘనంగా గాంధీ వర్ధంతి

కోటపల్లి/లక్సెట్టిపేట/చెన్నూర్: స్వాతంత్ర్య సమర యోధుడు మహాత్మ గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. చెన్నూర్ పట్టణంలో కాంగ్రెస్ యూత్ నాయకులు పాతర్ల నాగరాజు ఆధ్వర్యంలో, లక్సెట్టిపేట వాకర్స్ క్లబ్, విద్యాసంస్థల్లో, కోటపల్లి ప్రాథమిక పాఠశాల బమన్‌పల్లిలో వేడుకలు నిర్వహించారు. గాంధీ విగ్రహానికి పూల మాలలు సమర్పించి నివాళులర్పించారు. కార్యక్రమంలో చెన్నూర్‌లో చెన్నూరి రాజేశ్, చింతల శ్రీనివాస్, కడవండి మహేశ్, సుమంత్, లింగంపల్లి మహేశ్, లక్సెట్టిపేటలో ఉపాధ్యాయులు, వాకర్స్ సభ్యులు, కోటపల్లిలో హెచ్‌ఎం బుచ్చన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్/జన్నారం: మందమర్రి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు, అంగడిబజార్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు సొత్కు సుదర్శన్ గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అందుగులపేటలో కుష్టువ్యాధిపై అవగాహన కల్పించారు. ఎంపీపీ గుర్రం మంగ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ప్రభుత్వ వైద్యాధికారి రమేష్ హాజరై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. జన్నారం మండలం గాంధీనగర్ కాలనీలో నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ మచ్చ శంకరయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


జన్నారం: పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రమేశ్


కోటపల్లి: నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం, విద్యార్థులు

ఉచిత మెగా వైద్య శిబిరానికి స్పందన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్‌లో జెడ్పీటీసీ పూస్కూరి శిల్ప, ప్రతిమ ఫౌండేషన్–ప్రతిమ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరానికి పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలిరాగా వైద్యులు ఉచితంగా పరీక్షలు జరిపి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ శిల్ప మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఉచిత వైద్య శిబిరం ద్వారా ప్రతి ఒక్కరూ మెరుగైన ఆరోగ్యంతో ఉండాలనే ఆకాంక్షతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైద్య పరీక్షలు అవసరమైన వారికి కరీంనగర్ ప్రతిమ ఆస్పత్రిలో ఉచితంగా వైద్యం అందేలా కూడా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. శిబిరంలో స్థానిక నాయకులు బొడ్డు శంకర్, దొమ్మటి సత్తయ్య, పోడేటి సత్తయ్య, పూదరి రవి, విష్ణు, బొడ్డు భూమయ్య, లచ్చయ్య, జయరాజ్, ప్రతిమ ఆస్పత్రి వైద్య బృందం, స్థానికులు పాల్గొన్నారు.


వైద్య శిబిరంలో పరీక్ష చేస్తున్న వైద్యురాలు

'మాజీ ఎమ్మెల్యేవి అర్థంలేని ఆరోపణలు'

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఎన్నికల్లో ఓడిపోయి, కాంగ్రెస్‌పై లేనిపోని అర్థంలేని ఆరోపణలు చేస్తున్నారని మంచిర్యాల మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ రావుల ఉప్పలయ్య, నస్పూర్ ఫ్లోర్ లీడర్ వేణులు మంగళవారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 20ఏళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న దివాకర్‌రావు మంచిర్యాలను అభివృద్ధి చేయలేదని, కానీ ఆయన ప్రస్తుత ఎమ్మెల్యేపై విమర్శలను చేయడం శోచనీయమన్నారు. ప్రేమ్‌సాగర్‌రావుపై అసత్యపు ఆరోపణలు చేస్తున్నారనే ప్రజలు దివాకర్‌రావును ఓడించారని, ఓడిపోయినా కూడా మళ్లీ అదే అసత్యపు ఆరోపణలు చేయడం ఏంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నిధులు అడ్డుకుంటుందని అంటున్న మాజీ ఎమ్మెల్యే, తన హయాంలో ఏమి చేశాడని ప్రశ్నించారు. తమ ఎమ్మెల్యే ఒక విజన్ ఉన్న నాయకుడని, నియోజకవర్గాన్ని పురోగతిలోకి ఎలా తీసుకెళ్తారో భవిష్యత్ ప్రణాళికను రూపొందించి, ముందుకు పోతున్నారన్నారు. ఓపిక ఉంటే అభివృద్ధి ఎలా చేయాలో సలహాలు ఇవ్వాలని, మా ఎమ్మెల్యే ప్రజాహిత కార్యక్రమాలకు చేసే సూచనలను తప్పకుండా పరిగణలోకి తీసుకుంటారని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులు ఆగిపోయాయని గగ్గోలు పెట్టడం హాస్యాస్పదంగా ఉందని, నస్పూరు మున్సిపాలిటీలో జరిగిన అవినీతి, అక్రమాలను తవ్వితీసి చట్టపరమైన చర్యలకు ఉపక్రమిస్తామని వేణు అన్నారు.


మాట్లాడుతున్న రావుల ఉప్పలయ్య

పౌరహక్కులపై అవగాహన

దండేపల్లి/మందమర్రిరూరల్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): పౌరహక్కుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. దండేపల్లి మండలంలోని మాకులపేటలో ఎస్సై ప్రసాద్ హక్కులు, విధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. మందమర్రి మండలం పొన్నారంలో సర్పంచ్ సంకె లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి డిప్యూటీ తహసీల్దార్ సుమన్ హాజరై అవగాహన కల్పించారు. హాజీపూర్ మండలం పెద్దంపేట గ్రామ పంచాయతీ ఆవరణలో స్థానికులకు రెవెన్యూ, పోలీస్ అధికారులు అవగాహన కల్పించారు. కుల, మత విభేదాలకు తావులేకుండా అంతా సమానత్వంతో వ్యవహరించాలన్నారు. కార్యక్రమాల్లో దండేపల్లిలో సర్పంచ్ అత్తె రాజవ్వ, ఆర్‌ఐ భూమన్న, జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు అంజన్న, మందమర్రిలో రామకృష్ణాపూర్ ఎస్సై రాజశేఖర్, ఆర్‌ఐ పద్మజా, ఉపసర్పంచ్ రవీందర్‌రావు, జెడ్పీ హెచ్‌ఎస్ హెచ్‌ఎం దత్తుమూర్తి, కార్యదర్శి హరీష్, హాజీపూర్‌లో ఎస్సై నరేశ్‌కుమార్, నాయబ్ తహశీల్దార్ హరిత, గిర్దావర్ మంగ, పంచాయతీ కార్యదర్శి రూపాదేవి, సర్పంచ్ పొట్టాల సుమలత, ఎంపీటీసీ జాడి వెంకటేశ్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ జిల్లా సభ్యులు రేగుంట లింగయ్య, స్థానికుడు పొట్టాల శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న డీటీ సుమన్

ఆఖ్రీసఫర్‌ను వినియోగంలోకి తేవాలి

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీకి పట్టణ ప్రగతి నిధుల నుంచి కేటాయించిన ముస్లింల ఆఖ్రీసఫర్, క్రిస్టియన్ల కోసం ఏర్పాటు చేసిన మరో వాహనం (అంతిమయాత్ర)లను విని యోగంలోకి తీసుకురావాలని 18వ వార్డు కౌన్సిలర్ హాఫీజ బేగమ్ మంగళవారం మున్సిపల్ మేనేజర్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు.

భైరవస్వామిని దర్శించుకున్న అదనపు కలెక్టర్


అదనపు కలెక్టర్‌ను సన్మానిస్తూ...

కోటపల్లి: పార్‌పల్లి గ్రామంలో కొలువైన భైరవస్వామిని జయశంకర్ భూపాలపల్లి జిల్లా అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఎంపీడీవో రవీంద్రనాథ్‌చారి, ఆలయసభ్యులు ఓం ప్రకాశ్, శ్రీనివాస్, రాజేశ్, రామకృష్ణ, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లును శాలువాతో సన్మానించారు.

బీఎంఎస్ నుంచి తొలగింపు

శ్రీరాంపూర్: సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) కేంద్ర కార్యవర్గ సభ్యుడు కాదాసి భీమయ్యను యూనియన్ పదవి, ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగిస్తున్నట్లు ఆ యూనియన్ కేంద్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రమశిక్షణ రాహిత్యంగా వ్యవహరించడం, యూనియన్ అభివృద్ధికి విఘాతం కలిగించేలా వ్యవహరించినందుకు గాను ఆయనపై ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇక నుంచి ఆయనకు బీఎంఎస్‌తో సంబంధం లేదని తెలిపారు.

సీఎంఓఏఐ అధ్యక్షుడికి సన్మానం

శ్రీరాంపూర్: సింగరేణి అధికారుల సంఘం(సీఎంఓఏఐ) శ్రీరాంపూర్ డివిజన్‌కు నూతన అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన ఏరియా క్వాలిటీ ఇన్‌చార్జి వెంకటేశ్వర్‌రెడ్డిని నస్పూర్ మున్సిపాలిటీ రెడ్డి పరివార్ నాయకులు ఘనంగా సన్మానించారు. జీఎం కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో మంగళవారం శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో డీవైపీఎం దేవేందర్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, రెడ్డిపరివార్ పట్టణ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు సురేందర్‌రెడ్డి, రాఘవరెడ్డి, తిరుపతిరెడ్డి, , చంద్రశేఖర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి సమ్మిరెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ



చెన్నూర్: పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు సుద్దపల్లి సుశీల్‌కుమార్ మాతృమూర్తి వెంకటమ్మ మంగళవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందారు. చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి సుశీల్‌కుమార్ తల్లి పార్థివదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు ఫయాజ్, తనుగుల రవి, చింతల శ్రీనివాస్, కొంపల్లి బానేశ్ పాల్గొన్నారు.

సర్పంచులకు ఆత్మీయ సన్మానం

బెల్లంపల్లి: ఐదేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకుని మాజీలవుతున్న గ్రామపంచాయతీ సర్పంచులకు బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు సత్కారం చేశారు. బెల్లంపల్లిలోని పద్మశాలీ భవన్‌లో మంగళవారం జరిగిన బీఆర్‌ఎస్ అసెంబ్లీ నియోజకవర్గస్థాయి విస్తృత సమావేశంలో ఆ పార్టీ అగ్ర నాయకులు పార్టీ పక్షాన గెలిచిన సర్పంచులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించింది. రాష్ట్ర మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ ఎమ్మెల్యేలు దుర్గం చిన్నయ్య, ఎస్.దివాకర్‌రావు, బోడ జనార్దన్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఏడు మండలాల నుంచి ఎన్నికైన సర్పంచులను వేదికపై ఆహ్వానించి పూలమాల వేసి ఘనంగా సన్మానం చేశారు. ఐదేళ్ల కాలంలో ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ సత్యనారాయణ, బీఆర్‌ఎస్ జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.


సన్మానిస్తున్న ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు

బీఆర్‌ఎస్‌లో అనూహ్య పరిణామాలు

- మరో 8 మంది కౌన్సిలర్లు వేరే శిబిరానికి పయనం

రామకృష్ణాపూర్: బీఆర్‌ఎస్‌లో మళ్లీ అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. తాజాగా మరో ఎనిమిది మంది కౌన్సిలర్లు వేరే శిబిరానికి తరలివెళ్లారు. ఇప్పటికే క్యాతనపల్లి మున్సిపాలిటీ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ సహా తొమ్మిది మంది కౌన్సిలర్లు బీఆర్‌ఎస్‌ను వీడిన సంగతి తెల్సిందే. సోమవారం రాత్రి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాగా మంగళవారం ఈ వ్యవహారం మరో మలుపు తిరిగింది. ప్రస్తుతం ఉన్న కౌన్సిలర్లలో ఎనిమిది మంది వేరే శిబిరానికి చేరుకున్నారు. వీరిలో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు ఆశించే వారెవరూ లేకపోయినా ..కేవలం అవిశ్వాస తీర్మానం నెగ్గాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ గూటికి తొమ్మిది మంది, బీఆర్‌ఎస్ శిబిరానికి ఎనిమిది మంది కౌన్సిలర్లు వెళ్లగా ఐదుగురు మాత్రమే తటస్థంగా ఉన్నారు. తాజా క్యాంపునకు తరలిన వారు మాత్రం ఫిబ్రవరి 6న నిర్వహించే అవిశ్వాస తీర్మానంలో పాల్గొనే అవకాశం ఉంది. అప్పటివరకు ఈ దరిదాపుల్లోకి వచ్చే పరిస్థితులు లేవని చెబుతున్నారు. ఏదేమైనా క్యాతనపల్లి మున్సిపాలిటీలో రాజకీయ పరిణామాలు రోజురోజుకు మలుపు తిరుగుతున్నాయని చెప్పక తప్పదు. కాగా ఈ అవిశ్వాస తీర్మానం తెరపైకి రావడంలో లోతైన ప్రణాళికలు ఉన్నాయనే టాక్ కూడా వినిపిస్తోంది.

'మీ సేవ' కోసం కలెక్టర్‌కు వినతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని గుడిపేటలో మీ సేవ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం గుడిపే ట సర్పంచ్ లగిశెట్టి లక్ష్మి కలెక్టర్ బాదావత్ సంతోశ్‌కు వినతిపత్రం అందజేశారు. గుడిపేటలో మీ సేవ కేంద్రం ఏర్పాటు చేసి, ఈ ప్రాంత ప్రజలు, విద్యార్థుల ఆన్‌లైన్ సేవల సమస్యలు తీర్చాలని సర్పంచ్ విన్నవించగా కలెక్టర్ సానుకూలంగా స్పందించి మీ సేవ ఏర్పాటు చేసేలా చూస్తామని తెలియజేసినట్లు సర్పంచ్ తెలిపారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై సభ్యుల నిరసన

బెల్లంపల్లి: గ్రామ పంచాయతీ నిధులను దుర్వినియోగం చేశారని, తీర్మానం లేకుండానే బిల్లులు మంజూరు చేశారని ఆరోపిస్తూ పంచాయతీ వార్డు సభ్యులు గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన చేసిన ఘటన తాండూర్ మండలంలో చోటు చేసుకుంది. తాండూర్ మేజర్ గ్రామ పంచాయతీ సాధారణ సమావేశాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. సర్పంచ్ పూదరి నవీన్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి గ్రామ పంచాయతీ పరిధిలోని 14మంది వార్డు సభ్యులు హాజరయ్యారు. గ్రామపంచాయతీకి మంజూరైన నిధుల వివరాలను పలువురు సభ్యులు సమావేశంలో ప్రస్తావించారు. సభ్యుల తీర్మానం లేకుండా, సభ్యులకు కనీస సమాచారం లేకుండా నిధులు దుర్వినియోగం చేశారని, ఇందుకు సంబంధించిన లెక్కలు చెప్పాలని వార్డు సభ్యులు పట్టుబట్టారు. నిధుల లెక్కలు చెప్పాల్సిందేనని సర్పంచ్ నవీన్, పంచాయతీ కార్యదర్శి(ఈవో) తపస్‌ను కోరారు. సభ్యుల ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా సమావేశం నుంచి సర్పంచ్, ఈవో అర్ధంతరంగా వెళ్లిపోయారు. సర్పంచ్, ఈవో తీరుతో ఆగ్రహం చెందిన వార్డు సభ్యులు గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు తిరుపతి, పెద్దబోయిన రాజేశం, సిద్ధం స్రవంతి, కొండు జ్యోతి మాట్లాడుతూ... గ్రామ పంచాయతీలో సర్పంచ్, ఈవోలు ఇష్టారీతిన వ్యవహరిస్తూ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. సభ్యుల తీర్మానం లేకుండా బిల్లులు డ్రా చేసుకున్నారన్నారని, నిధుల గురించి అడిగితే ఎలాంటి సమాధానం ఇవ్వడం లేదని ఆగ్రహించారు. పంచాయతీ నిధుల దుర్వినియోగంపై ఉన్నతాధికారులు తగు విచారణ జరిపి బాధ్యులపై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.


నిరసన వ్యక్తం చేస్తున్న వార్డు సభ్యులు

సంక్షిప్త వార్తలు

మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థి ప్రతిభ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఈ నెల 28వ తేదీన హైదరాబాద్ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన సెకండ్ ఇంటర్‌నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఇన్విటేషన్ పోటీల్లో హాజీపూర్ మండలం గుడిపేట మౌంట్ కార్మల్ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి సాయితేజ విశేష ప్రతిభతో రాణించి బంగారు పతకం సాధించాడు. సినీ హీరో, కరాటే మాస్టర్ సుమన్ చేతుల మీదుగా బంగారు పతకాన్ని అందుకోగా కరాటే మాస్టర్లు తల్వార్, జూల శ్రీనివాస్ ఉన్నారు. సాయితేజను ప్రిన్సిపాల్ సిస్టర్ ఆల్ఫీ, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పంచాయతీ అధికారుల సంఘం జిల్లా క్యాలెండర్‌ను మంగళవారం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాహుల్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓలు ఫణీందర్‌రావు, ప్రభాకర్‌రావు, మండల పంచాయతీ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీపతి బాపు, ప్రధాన కార్యదర్శి సఫ్దర్‌అలీ, కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీ భవనం ప్రారంభం

దండేపల్లి: మండలంలోని చింతపల్లిలో రూ.20లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించిన గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, సర్పంచ్ అక్కల దేవేంద్ర మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మల్లేశం, ఉపసర్పంచ్ తిరుపతి, మాజీ ఉపసర్పంచ్ మధు, వార్డు సభ్యులు, పాల్గొన్నారు.

వరిక్షేత్రాల సందర్శన

కోటపల్లి: మండలంలోని ఎదులబంధం, పుల్లగామ, సిర్సా, రొయ్యలపల్లి గ్రామాల్లోని వరి క్షేత్రాలను ఏవో మహేందర్ సందర్శించి రైతులకు సలహాలు, సూచనలు చేశారు. చలి తీవ్రత పెరిగినందునా నాట్లు వేసిన వరిలో నీటిని మారుస్తూ ఉండాలని, పీక పురుగు ఉ ధృతికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహ న కల్పించారు. రైతులు యూరియా వాడకం తగ్గించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో సుమన్, రైతులు పాల్గొన్నారు.

చిరంజీవిని సత్కరించిన వాసవి క్లబ్ నేతలు

మంచిర్యాలటౌన్: మెగాస్టార్ చిరంజీవి పద్మవిభూషన్ అవార్డును అందుకున్న సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ, వాసవి క్లబ్‌ల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు.